## క్లుప్తంగా

### బాల్య వివాహాలను ప్రోత్సహించరాదు



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి

ఉయ్యాలవాడ : బాల్య వివాహాలను ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దీప్తి, ఎంఈఓ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బాల్య వివాహాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. వారు మాట్లాడుతూ 18 సంవత్సరాలు దాటిన తరువాతనే బాలికలకు వివాహాలు చేయాలన్నారు. దొర్నిపాడు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ప్రభావతమ్మ పాల్గొన్నారు.

### అర్హులకు రుణాలివ్వాలి



లీడ్ బ్యాంక్ మేనేజరుకు స్వాగతం పలుకుతున్న దృశ్యం

నంద్యాల(న్యూటౌన్): అర్హులకు రుణాలు అందించాలని నంద్యాల జిల్లా డీఆర్‌డీఏ వైకేపీ ప్రాజెక్ట్ డైరెక్టర్, లీడ్ డిస్ట్రిక్ మేనేజర్ రవీంద్రకుమార్ తెలిపారు. బుధవారం పట్టణంలోని ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ చైర్మన్‌ను కలిశారు. ప్రభుత్వంఅమలు చేస్తున్న పథకాలైన జగనన్న తోడు, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రాం,ప్రధాన మంత్రి ఫార్మలైజేషన్ ఆఫ్ మైక్రో ఫుడ్ ఎంటర్ ప్రైజెస్ రుణాలను అర్హులైకు త్వరితగతిన అందించాలని కోరగా.. ఏపీజీబీ చైర్మన్ రాకేష్ కశ్యప్ సానుకూలంగా స్పందించారు.ఏపీజీబీ రీజినల్ మేనేజర్ నవీన్ కుమార్, కో–ఆర్డినేటర్ ఎల్లయ్య పాల్గొన్నారు.

### పోతిరెడ్డిపాడు ద్వారా నీరు వదలాలి

నంద్యాల(న్యూటౌన్): పోతిరెడ్డిపాడు ద్వారా తక్షణమే నీటిని విడుదల చేయాలని, ఐడీబీ సమావేశంలో నీటి విడుదల తేదీ ఖరారు చేయకపోవడం అన్యాయమని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు రాజశేఖర్, రామచంద్రుడు, మార్కు కోరారు. బుధవారం స్థానిక కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. వారు మాట్లాడుతు జిల్లాలోని తాగు,సాగు నీరు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణ మే పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా నీటిని వదలాలని జిల్లా కలెక్టరుకు వినతి ప్రతం అందజేశారు. సంఘం జిల్లా సహకార్యదర్శి రాజశేఖర్, సుధాకర్, సురేష్,ప్రసాద్, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

### రిజర్వేషన్ ప్రకారం సీట్లు భర్తీ చేయాలి

నంద్యాల(న్యూటౌన్): రిజర్వేషన్ ప్రకారం మెడికల్ సీట్లు భర్తీ చేయాలని, మెడికల్ విద్యార్థులకు అన్యాయం చేసే జీఓ నెం.107,108 ను రద్దు చేయాలని ఏఐఎస్‌ఎఫ్ నాయకులు కోరారు. బుధవారం పట్టణంలోని పద్మావతి నగర్ సెంటర్‌లో రాస్తారోకో నిర్వహించారు. సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ధనుంజయుడు మాట్లాడుతూ మెడికల్ సీట్ల కేటాయింపులో 85 శాతం కన్వీనర్ కోటాలో భర్తీ చేయాలన్నారు. మిగిలిన సీట్లను 15 శాతం క్రీడారంగానికి, ఎన్‌సీసీ విద్యార్థులు, పోలీసు అమరవీరుల విద్యార్థులకు వర్తింపజేయాలని విజ్ఞప్తి చేశారు.

### ఘనంగా మౌలాలి స్వామి జార్తలు



మౌలాలి పీరును ఊరేగిస్తున్న దృశ్యం

శిరివెళ్ల: మండలంలోని కోటపాడు గ్రామంలో బుధవారం మౌలాలి స్వామి జార్తలు ఘనంగా జరిగాయి. మంగళవారం రాత్రి నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. రాత్రి స్వామి వారికి గ్రామస్తులు కుల మతాలకతీతంగా పూల దట్టీలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బీ. అబ్దుల్ సలాం, సీఐ చంద్రబాబునాయుడు, తహసీల్దార్ షేక్ మొయిద్దీన్, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యం, గ్రామ పెద్దలు స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు.

### చెరువులను నింపాలి

నంద్యాల(న్యూటౌన్): వేదవతి రిజర్వాయర్, ఆర్డీఎస్ కాలువ నిర్మాణం పూర్తి చేయాలని, హంద్రీ నీవా నుంచి 106 చెరువులను నీటితో నింపేలా చర్యలు తీసుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ప్రభాకర్ రెడ్డి కోరారు. బుధవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కల్వకుర్తి, నంద్యాల, జమ్మలమడుగు, చెన్నై జాతీయ రహదారలకు కేంద్రం నిధులు కేటాయించిందన్నారు. వెంటనే పనులను పూర్తి చేయాలన్నారు.

**విజయవంతం చేయాలి**

117 జీవోను రద్దు చేసి ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని ఈ నెల 12వ తేదీన ఫ్యాప్టో ఆధ్వర్యంలో జరిగే ధర్నాను విజయవంతం చేయాలని చైర్మన్ మాధవస్వామి కోరారు. బుధవారం స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...సీపీఎస్ రద్దు చేసి జీపీఎస్ విధానాన్ని వెనక్కు తీసుకోవాలన్నారు. అలాగే పాత పింఛన్ అమలు చేసి ఉపాధ్యాయుల జీతాలను వెంటనే మంజూరు చేయాలన్నారు.

# గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తాం



కలెక్టర్‌ను సన్మానిస్తున్న గిరిజన సంఘాల నాయకులు

నంద్యాల: అన్ని గూడేల్లోని గిరిజనుల సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ తెలిపారు.బుధవారం కలెక్టరేట్‌లోని వైఎస్సార్ సెంటినరీ హాలులో జిల్లా గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ప్రపంచ ఆదివాసి దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. గిరిజనులు, విద్యార్థులు గిరిజనుల వేషధారణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. వేడుకలకు జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. షెడ్యూల్ తెగల ప్రజల అభివృద్ధికి జిల్లాలో ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నామన్నారు. ఆసక్తి ఉన్న రంగాల్లో స్కిల్ డెవలప్మెంట్ ద్వారా శిక్షణ ఇప్పించి స్వయం ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం గిరిజన నాయకులు జిల్లా కలెక్టరును శాలువాతో సన్మానించారు. ఆలిండియా బంజారా సేవా సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ కె. బాలానాయక్, గిరిజన ప్రజా సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు కె. రాజునాయక్, ప్రధాన కార్యదర్శి కే.రవి నాయక్, వివిధ సంఘాల నాయకులు విక్రమ్ సింహ నాయక్, శంకర్ నాయక్, స్వామినాయక్, రవీంద్రనాయక్, జవహర్ నాయక్, శ్రీను నాయక్, గోపాల్, డీఆర్‌ఓ పుల్లయ్య, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జగన్నాథ రావు, ఏటీడబ్ల్యూఓ హుసేనయ్య పాల్గొన్నారు.



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

### చేతులను శుభ్రంగా ఉంచుకోవాలి



రికార్డులను పరిశీలిస్తున్న డాక్టర్ కామేశ్వరరావు

దొర్నిపాడు: చిన్నారులు చేతులను భోజనానికి ముందు తప్పని సరిగా చేతులు శుభ్రం చేసుకునేలా చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియ అధికారి డాక్టర్ కామేశ్వరరావు అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. బుధవారం ఆయన మండలంలోని డబ్ల్యూ. కొత్తపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. వైద్యశాలలోని వసతులు, ల్యాబ్, మందులు తదితర వాటిపై డాక్టర్ భార్గవితో ఆరా తీశారు. అనంతరం అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసి అల్బెండజెల్ మాత్రల గురించి అవగాహన కల్పించారు. రా అనతంరం రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎంపీహెచ్‌ఈఓ నారాయణ, ల్యాబ్ అసిస్టెంట్ సిరజ్‌బాషా, హెల్త్ అసిస్టెంట్ రాముడు పాల్గొన్నారు.

**రోడ్డు ప్రమాదంలో ఇద్దరి తీవ్ర గాయాలు**

చాగలమర్రి: వైఎస్సార్ జిల్లా ఇడమడక గ్రామం మెట్ట సమీపంలోని పోలీసు చెక్ పోస్టు వద్ద ప్రొద్దుటూరుకు వెళ్లి వస్తున్న మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీ కొన్న ప్రమాదంలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. వివరాలు..మండలంలోని శెట్టివీడు గ్రామానికి చెందిన ఉశేన్‌బాషా, ముత్యాలపాడు గ్రామానికి చెందిన మౌలాలి ఇద్దరూ స్నేహితులు. టైలరు వృత్తి చేసేవారు. సొంత పనిమీద ప్రొద్దుటూరు వెళ్లి తిరిగి వస్తుండగా ఇడమడక సమీపంలోని పోలీస్ చెక్ పోస్టు వద్ద మోటారు సైకిల్ అదుపు తప్పి డివైడర్‌కు ఢీకొనడంతో కింద పడి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు 108కు సమాచారం అందించగా, క్షతగాత్రులను చాగలమర్రిలోని కేరళా అసుపత్రికి తరలించారు.

# ఓటర్ల జాబితా పరిశీలనలో బీఎల్‌ఏలను భాగస్వామ్యం చేయండి



సమావేశంలో పాల్గొన్న రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు

నంద్యాల: ఈనెల 21వ తేదీ వరకు ఓటర్ల జాబితా ఇంటింటి పరిశీలన జరుగుతుందని, బీఎల్‌ఏలను భాగస్వామ్యం చేసి పారదర్శక ఓటర్ల జాబితా రూపకల్పనకు సహకరించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సూచించారు. బుధవారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఓటర్ల జాబితా సవరణపై గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. డీఆర్‌ఓ పుల్లయ్య, అన్ని నియోజకవర్గాల ఈఆర్వో, ఏఈఆర్వోలు, బీజేపీ నుంచి ఎం. గంగాధర్, సీపీఐ ఎన్. రంగనాయుడు, సీపీఎం రమేష్ కుమార్, కాంగ్రెస్ సయ్యద్ రియాజ్ బాషా, వైఎస్సార్‌సీపీ నుంచి అనిల్ అమృతరాజ్, సాయిరాం రెడ్డి, టీడీపీ నరేంద్ర కుమార్ పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు బూత్ స్థాయి ఏజెంట్లను భాగస్వామ్యం చేయాలన్నారు. కుటుంబంలోని కుటుంబ సభ్యుల ఓట్లు వేరువేరు పోలింగ్ స్టేషన్లో ఉండకుండా ఒకే పోలింగ్ స్టేషన్లో ఉండేలా చర్యలు తీసుకోవాలని బీఎల్‌ఓలకు సూచించాలని ఈఆర్వోలను ఆదేశించారు. నకిలీ ఓటర్లను సుమోటోగా కాకుండా ఫాం 7 ద్వారా తొలగించాలన్నారు. ఓటర్ల జాబితాలో ఏమాత్రం లోపాలున్న సంబంధిత ఈఆర్‌ఓలపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నందికొట్కూర్, శ్రీశైలం, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని చెంచుగూడెంలలో దాదాపు 2000 మంది గిరిజన ఓటర్లు నమోదు కావాల్సి ఉందని, ఈ అంశంపై వీఆర్వోలు ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు.

### ఆరోగ్య శ్రీ కేసులను ప్రత్యేకంగా చూడండి

నంద్యాలటౌన్: ఆరోగ్య శ్రీ కేసులను విలేజ్ హెల్త్ క్లినిక్‌లలో ప్రత్యేకంగా చూడాలని జిల్లా వైద్యాదికారి డాక్టర్ వెంకటరమణ సూచించారు. ఆ కేసుల్లో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. నంద్యాల మండలం బిల్లలాపురం విలేజ్ హెల్త్ క్లినిక్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డాక్టర్ కాంతారావునాయక్ పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న వైద్యాధికారి వెంకటరమణ



మొక్క నాటుతున్న దృశ్యం.



ఆలమూరులో ఏర్పాటు చేసిన శిలాఫలకం వద్ద అధికారులు

## పుడమిని కాపాడుకుందాం

గోస్పాడు: ప్రతిఒక్కరూ పుడమి తల్లిని కాపాడాలని ఎంపీపీ ఆర్థర్ సైమాన్ కోరారు. ఎంపీడీఓ భాస్కర్, ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయ్‌శేఖర్ ఆధ్వర్యంలో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం నాభూమి–నాదేశం శిలా ఫలకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అధికారులు, ఆయా శాఖల సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. వైస్ ఎంపీపీ రాజు, ఈఓఆర్డీ అనసూయ, ఏపీఓ నాగజ్యోతి, ఈసీ మహేష్, ఫీల్డ్, టెక్నికల్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

నంద్యాల (అర్బన్): మండలంలోని బిల్లలాపురం పెద్దకొట్టాల,భీమవరం గ్రామాల్లో ఆజాదీకా అమృత్ మహోత్సవ్ వేడుకల్లో బాగంగా నా భూమి – నా దేశం, నేల తల్లికి నమస్కారం, వీరులకు వందనం కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. పెద్ద కొట్టాలలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ సుగుణ శ్రీ, డ్వామా పీడీ రామచంద్రారెడ్డి, ఎంపీపీ ప్రభాకర్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు.గ్రామ సర్పంచ్ వెంకట రమణ పాల్గొన్నారు.

రుద్రవరం: మండలంలోని ఆలమూరు, హరినగరం, యాల్లావత్తుల గ్రామాల్లో బుధవారం నామట్టి–నాదేశం కార్యక్రమంలో భాగంగా అధికారులు శిలా ఫలాకలను ఏర్పాటు చేశారు. తహసీల్దార్, గ్రామ సర్పంచ్ లక్ష్మిదేవి, ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీఓ ప్రతాప్, నాయకులు పాణ్యం చంద్ర, శూలం ప్రభాకర్, నాగేష్, పీహెచ్‌సీ వైద్య సిబ్బంది తదితరులు ఆయా గ్రామాల్లో ముందుగా మువ్వెన్నల జెండాను ఎగురవేశారు.

ఉయ్యాలవాడ : స్వాతంత్ర్య సమరయోధులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాలని ఎంపీడీఓ ఉమామహేశ్వర రావు పేర్కొన్నారు. బుధవారం మండలంలోని ఆర్. పాంపల్లె గ్రామంలో నామట్టి.. నా దేశం కార్యక్రమంలో భాగంగా జాతీయ జెండాను ఆవిష్కరించి, దేశం కోసం పోరాటం చేసిన అమరవీరులకు వందనాలు సమర్పించారు. అలాగే కొండుపల్లె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో కార్యక్రమాలు నిర్వహించారు.

## నామినేషన్ ప్రక్రియ ప్రారంభం

ఉయ్యాలవాడ: మండలంలోని హరివరం గ్రామ పంచాయతీ పరిధిలో ఖాళీగానున్న 7వ వార్డుకు సంబంధించి నామినేషన్ ప్రక్రియ బుధవారం ప్రారంభమైంది. అదే వార్డులోని తొగట చౌడమ్మ అభ్యర్థి నామినేషన్ దాఖలు చేశారు. గతంలో ఈ వార్డు బీసీలకు కేటాయించగా.. వార్డుకు ప్రాతినిధ్యం వహిస్తున్న తొగట సుబ్బరామయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఆయన సతీమణి చౌడమ్మ నామినేషన్ దాఖలు చేసినట్లు రిటర్నింగ్ అధికారి రామకృష్ణారెడ్డి తెలిపారు.

**వార్డు మెంబర్‌కు ఒక నామినేషన్**

శిరివెళ్ల: వార్డు మెంబర్ల ఎన్నికలకు మండలంలో నామినేషన్లు మొదలయ్యాయి. వనికినిదిన్నె గ్రామంలోని 5వ వార్డుకు జిలకర సుశీలమ్మ బుధవారం రిటర్నింగ్ అధికారి నారాయణమూర్తికి తన నామినేషన్ అందచేశారు. గుంప్రమాన్‌దిన్నె, యర్రగుంట్ల వార్డు మెంబర్లకు ఎలాంటి నామినేషన్లు దాఖలు కాలేదు.

రుద్రవరం: మండలంలోని నర్సాపురం గ్రామంలోని 10 వార్డుకు బుధవారం ఒక్క నామినేషన్ దాఖలైంది. మండలంలో పేరూరు 5వ వార్డు, ఆర్.నాగులవరం 7వ వార్డు, నర్సాపురం 10 వార్డు సభ్యుల స్థానాలు ఖాళీగా ఉండటంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఇందులో భాగంగానే నామినేషన్ దాఖలైందని ఎంపీడీఓ మధుసూదన్‌రెడ్డి తెలిపారు.



హరివరంలో అభ్యర్థి నుంచి నామినేషన్ పత్రాన్ని స్వీకరిస్తున్న రిటర్నింగ్ అధికారి

**సర్పంచుకు రెండు నామినేషన్లు దాఖలు**

ఆళ్లగడ్డ : గ్రామ సర్పంచు ఉప ఎన్నికలకు రెండు నామినేషన్లు దాఖలైనట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి రామకృష్ణా నాయక్ తెలిపారు. కోటకందుకూరు గ్రామం సర్పంచ్ అభ్యర్థులుగా బుధవారం సుంగల రియాజ్, అలీసాబ్ గారి ముక్తార్ బాషా ఒక్కో సెట్ నామినేషన్లు దాఖలు చేశారు.

## ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న డాక్టర్ మహబూబ్ బాషా

నంద్యాల టౌన్: కొన్ని రోజుల నుంచి నంద్యాల సర్వజన ఆసుపత్రిలోని వైద్యాధికారులపై వస్తున్న ఆరోపణలు అవాస్తవమని డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ మహబూబ్ బాషా పేర్కొన్నారు. బుధవారం ఆసుపత్రిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సర్వజన ఆసుపత్రిలో నిష్పక్షపాతంగా విధులు నిర్వహిస్తున్న తమపై అలాగే సహ వైద్యుడు వరప్రసాద్‌పై కిందిస్థాయి ఉద్యోగులు అవాస్తవమైన ఆరోపణలు ప్రచారం చేస్తున్నారన్నారు. జనరల్ డ్యూటీ అటెండెంట్లు రమా, నాగమ్మ, స్టాఫ్ నర్స్ బాలవెంకటమ్మ ఆపరేషన్ థియేటర్లో విధులు నిర్వహిస్తూ అక్కడ రోగి తరుపు సహాయకుల నుంచి డబ్బులు డిమాండ్ చేస్తున్నారనే ఆరోపణలు రావటంతో పాటు రమా కోసం బయటి వ్యక్తులు తరచుగా వస్తున్నారని తోటి సిబ్బంది ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. విచారణ అనంతరం వారిని అక్కడి నుంచి బదిలీ చేసి ఆసుపత్రిలోని వేరే విభాగాల్లో నియమించామన్నారు. బదిలీని జీర్ణించుకోలేక నాగ రాముడు అనే వ్యక్తి ద్వారా కొన్ని దినపత్రికల్లో అవాస్తవాలు రాయించడం, అలాగే ప్రజా సంఘాల వారికి ఉన్నతాధికారులపై అసత్య ఆరోపణలు చేయిస్తున్నారన్నారు.అసత్య ఆరోపణలు ప్రచారం చేసినా, అవాస్తవాలు ప్రచురించిన వారిపై న్యాయపరంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. డాక్టర్ వరప్రసాద్, నర్సింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న పంటపై అడవి పందుల దాడి



ధ్వంసమైన మొక్కజొన్న పంటను చూపుతున్న రైతు ఓబులేసు

చాగలమర్రి: మండల కేంద్రం సమీపంలో కూలురు గ్రామానికి వెళ్లే దారిలోనున్న సుమారు 30 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేసిన మొక్కజొన్న పంట అడవి పందుల దాడిలో ధ్వంసమైంది. దీంతో రైతులు చాంద్‌బాషా, ఆనంద్, ఓబులేసు, బాలకృష్ణ తీవ్రంగా నష్టపోయారు. ఎకరాకు సుమారు రూ.25 వేల వరకు ఖర్చు చేసి పంట సాగు చేశామని, పంట చేతికి అందే సమయంలో పందుల దాడి చేసి ధ్వంసం చేయడంతో తీవ్రంగా నష్టపోయామని ఆవేదన వ్యక్తం చేవారు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరారు.

# అందరికీ సొంతిళ్లు కల్పించడమే లక్ష్యం



జగనన్న స్మార్ట్ టౌన్ షిప్ బ్రోచర్ విడుదల చేస్తున్న ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి

ఆళ్లగడ్డ : సొంత ఇళ్లు లేని ఉద్యోగులు, మధ్య తరగతి వారి కోసం జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి తెలిపారు. స్థానిక మహాలక్ష్మి ఫంక్షన్ హాలులో బుధవారం కుడా వైస్ చైర్మన్ ప్రతాపరెడ్డి అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే ఆళ్లగడ్డ జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ బ్రోచర్‌ను విడుదల చేసి వెబ్‌సైట్‌ను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ కర్నూలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్ ఏర్పాటు చేశారని, సొంతిళ్లు లేని చిరుద్యోగులు, మధ్య తరగతివారి కలలను సాకారం చేసేందుకు జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లకు శ్రీకారం చుట్టారని చెప్పారు. ప్రైవేటు వెంచర్ల కంటే సరసమైన ధరలకు స్థలం లభిస్తుందని, సౌకర్యాలు, వసతులు వాటికంటే ఎంతో మెరుగ్గా ఉంటాయన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎంపీపీ గజ్జల రాజేంద్రారెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నాయబ్ రసూల్, వైఎస్సార్‌సీపీ పట్టణ ఇన్‌చార్జ్ సుధాకర్‌రెడ్డి ఉన్నారు.

**భారీ శబ్ధాలు చేసే వాహనాల సీజ్**

బొమ్మలసత్రం: భారీ శబ్దాలు చేస్తూ శబ్ధకాలుష్యానికి కారణణమయ్యే వాహనాలను సీజ్ చేస్తామని జిల్లా ఎస్పీ కె. రఘువీర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ పట్టణంలో భారీ శబ్దాలతో తిరిగే 35 ద్విచక్ర వాహనాలను సీజ్ చేశామని చెప్పారు. ద్విచక్ర వాహనాలకు కొందరు కావాలనే పెద్ద శబ్దాలు వచ్చేలా సైలెన్సర్‌లను అమరుస్తున్నారన్నారు. వాటి నివారణకు స్పెషల్ డ్రైవ్ ఏర్పాటు చేశామన్నారు.

**విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి**

నంద్యాల(అర్బన్): విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ ఆధ్వర్యంలో మధ్యాహ్న విరామ భోజన సమయాన కార్యాలయ ఆవరణలో ఉద్యోగులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమం చేపట్టారు. జేఏసీ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, రామయ్య మట్లాడారు. అనంతరం డీఈ రమణారెడ్డికి సమ్మె పత్రాన్ని అందజేశారు.

**రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీలకు ఎంపిక**

నంద్యాల(న్యూటౌన్): స్థానిక ఎస్‌పీజీ క్రీడా మైదానంలో నిర్వహించిన జిల్లాస్థాయి ఫుట్‌బాల్ ఎంపిక పోటీల్లో గురురాజ స్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల డైరక్టర్ షేక్షావలి రెడ్డి బుధవారం తెలిపారు. సెప్టెంబర్‌లో వైఎస్సార్ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని చెప్పారు.

**ప్రజావ్యతిరేక విధానాలను విడనాడాలి**

నంద్యాల(న్యూటౌన్): కేంద్ర ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను విడనాడాలని ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి శంకర్, బాలవెంకట్, నాగరాజు, తోటమద్దులు డిమాండ్ చేశారు. బుధవారం దేశ వ్యాప్తంగా కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపులో భాగంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. బుధవారం పద్మావతి నగర్ ఆర్చ్ నుంచి తహసీల్దారు కార్యాలయం వరకు ర్యాలీ చేపట్టారు. సీఐటీయూ నాయకులు వెంకట్, చౌడప్ప,నాగరాజు, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు

నంద్యాల (వ్యవసాయం): పట్టణంలోని హౌసింగ్ బోర్డు కాలనీలో వెలసిన స్పటికలింగేశ్వరాలయంలో బుధవారం ఆడి కృత్తిక నక్షత్రాన్ని పురస్కరించుకుని శ్రీ వల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్య స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ఆవరణలోని నాగులపుట్ట ప్రాంగణంలో స్వామివారికి క్షీరాభిషేకం పంచామృత అభిషేకాలు చేసి మహామంగళ హారతులు ఇచ్చారు. ఆలయ నిర్వాహకులు యోగానంద మాట్లాడుతు ఆడి కృత్తిక నక్షత్రం రోజున సుబ్రహ్మణ్య స్వామికి ప్రత్యేక పూజలు చేయడం వలన సర్వ దోషాలు తొలగుతాయని చెప్పారు.

## నేడు డయల్ యువర్ డీఎం

నంద్యాల (వ్యవసాయం): ప్రయాణికుల సౌకర్యార్థం మెరుగైన సేవలు, సమస్యలు పరిష్కరించేందుకు నేడు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నంద్యాల డిపో మేనేజర్ గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గురువారం ఉదయం 11 నుంచి 12 గంటల వరకు ప్రయాణికులు సమస్యలు, సలహాలు, సూచనలు ఉంటే సెల్ 9959225800 నంబర్ కు ఫోన్ చేసి తెలియజేయాలని కోరారు.

**ఇంటిపై నుంచి పడి వ్యక్తి మృతి**

ఆళ్లగడ్డ: మండలంలోని జి.జమ్ములదిన్నె గ్రామంలో ప్రమాదవశాత్తు ఇంటిపై నుంచి కిందపడి సయ్యద్ బాషా (38) మృతి చెందాడు. బాషా గడేకారి పని చేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. బుధవారం గ్రామంలోనే ఇంటి నిర్మాణ పనులకు వెళ్లి పై కప్పుపై పని చేస్తూ ఉండగా ప్రమాద వశాత్తు జారి పై నుంచి కింద పడ్డాడు. గమనించిన సహచర కూలీలు ఆళ్లగడ్డ వైద్యశాలకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. మృతుడికి భార్య బీబీ, ఇద్దరు కుమారులు ఉన్నారు.

**శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలి**

చాగలమర్రి: సెప్టెంబర్ 6,7 తేదీలలో నిర్వహించే కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించాలని సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు కోరారు. ఈ సందర్భంగా సభ్యుల ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యచరణ సమావేశంలో జిల్లా కన్వీనర్ సల్లా నాగరాజు, ఎస్‌ఐఆర్‌డీ సొసైటీ అధ్యక్షుడు డాక్టర్ నాగేంద్రప్రసాద్ మాట్లాడారు.

**అన్నదానం**

నంద్యాల(న్యూటౌన్): పట్టణంలోని అయ్యలూరు మెట్ట వద్ద ఉన్న నవజీవన్ చెవిటి పిల్లల పాఠశాలలో బుధవారం అన్నదాన కార్యక్రమం మధుగౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ...నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్ రెడ్డి, నాగినిరెడ్డి దంపతుల వివాహ వార్షికోత్సవం సందర్భంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు.

**విద్యార్థులకు వ్యాసరచన పోటీలు**

చాగలమర్రి: హిరోషిమా, నాగసాకి వారోత్సవాల సందర్భంగా..చిన్నవంగలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జీవయ్య ఆధ్వర్యంలో దీక్ష జిల్లా కోఆర్డినేటర్ నాగేంద్ర కుమార్ సమక్షంలో బుధవారం విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. అనంతరం గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. అంతకు ముందు గ్రామంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు.

**శిక్షణ కేంద్రాలు ప్రారంభించటం హర్షణీయం**

నంద్యాల(న్యూటౌన్): రాష్ట్ర ప్రభుత్వం ఉర్దూ అకాడమీ కంప్యూటర్ శిక్షణ కేంద్రాల్లో శిక్షణ తరగతుల్ని ప్రారంభించాలని నిర్ణయించటం హర్షణీయమని ముస్లిం హక్కుల పోరాట సమితి నాయకుడు యూసఫ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ...గతంలో రోష్నీ పథకం కింద శిక్షణ కేంద్రాలను ప్రారంభించటంలో విఫలమయ్యారన్నారు.

## సూడోమోనాస్ ద్రావణంతో మేలు

నంద్యాల(అర్బన్): వరి నారును రైతులు సూడోమోనాస్ ద్రావణంలో వేర్లు ముంచి నాటుకోవాలని, నారు చివరలు కత్తిరించి నాటితే కాండం తొలుచు పురుగు ఉధృతిని తగ్గించుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ప్రసాదరావు సూచించారు. మండలంలోని అయ్యలూరు గ్రామంలో బుధవారం వైఎస్సార్ పొలం బడి కార్యక్రమం నిర్వహించారు. అనంతరం గ్రామ సభ నిర్వహించి రసాయనిక పురుగుమందుల వాడకంలో తమకు తామే నిర్ణయం తీసుకునే 30 మంది రైతులకు బ్యాలెట్ టెస్ట్ నిర్వహించారు. అనంతరం పలువురు రైతులకు పొలం బడి కిట్స్‌ను అందజేశారు. ఏఈఓలు మణిమోహన్‌రెడ్డి, ముక్తార్‌బాషా, వీఏఏ అనిల్ కుమార్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షలతో లాభాలు

దొర్నిపాడు: భూసారా పరీక్షల ద్వారా ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని ఏఓ సునీత తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో పొలంబడి కార్యక్రమంలో భాగంగా మట్టి నామునాలు సేకరించి వాటి ప్రయోజనాలను వివరించారు. తక్కువ పెట్టుబడులతో అధిక దిగుబడులు సాధించేలా రైతులకు అవగాహన కల్పించారు. పత్తి సాగులో రైతులకు మెలకువలు, సూచనలు ఇచ్చారు. రైతులు సేంద్రియ ఎరువులపై ఆసక్తి చూపాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏలు మల్లికార్జున, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.



మట్టినమూల సేకరణను పరిశీలిస్తున్న ఏఓ

**అనుమతులు లేని మందులు విక్రయించొద్దు**

గోస్పాడు: అనుమతులు లేని ఎరువు, పురుగు మందులను విక్రయిస్తే దుకాణాలపై చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి స్వప్నిక తెలిపారు. మండలంలోని యాళ్లూరు గ్రామంలో అన్నదాత ఏజెన్సీస్ దుకాణాన్ని బుధవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు, ఎరువులు, పురుగు మందుల నిల్వలను తనిఖీ చేశారు. దుకాణంలో పురుగు మందుల విక్రయాలకు సంబంధించిన రికార్డులు, ధ్రువ పత్రాలు సక్రమంగా లేకపోవడానికి గుర్తించి రూ.2,07,770 విలువ గల పురుగు మందల విక్రయాలను తాత్కాలికంగా నిలుపివేశారు.

**వైద్యాధికారులపై చర్యలు తీసుకోవాలి**

నంద్యాల(న్యూటౌన్): కిందిస్థాయి ఉద్యోగుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైద్యులపై చర్యలు తీసుకోవాలని, ఏఐఎస్‌ఎఫ్ జిల్లా కార్యదర్శి ధనుంజయుడు, విష్ణు, రవి డిమాండ్ చేశారు. బుధవారం వారు మాట్లాడుతూ...నంద్యాల ప్రభుత్వాస్పత్రిలో ప్రొఫెసర్, అసోసియేట్ ప్రొఫెసర్‌గా పని చేస్తున్న వైద్యాధికారులు డ్యూటీలు వేయించటంలో మహిళా ఉద్యోగుల్ని వేధిస్తున్నారని ఆరోపించారు. నంద్యాలలో సొంత క్లినికులు నడుపుతూ ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చిన పేషెంట్లను తమ క్లినిక్‌కు రావాలని సూచిస్తున్నారన్నారు.

**బాల్యవివాహాలు నేరం**



రుద్రవరంలో మాట్లాడుతున్న సీడీపీఓ తేజశ్విని

రుద్రవరం: బాల్యవివాహాలు చేయడం చట్టరీత్యా నేరం అని ఐసీడీఎస్ సీడీపీఓ తేజశ్విని తెలిపారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో బుధవారం బాల్య వివాహాల చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ యువతికి 18ఏళ్లు పూర్తిగా నిండాలన్నారు. యువకుడికి 21 ఏళ్లు నిండాక వివాహాలు చేయాలన్నారు. నిబంధనలకు విరుద్ధంగా తక్కువ వయస్సులోనే వివాహాలు చేయడం చట్టాన్ని ఉల్లంగించినట్లు అవుతుందని అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీంద్రప్రసాద్, సూపర్‌వైజర్ లక్ష్మిదేవి అంగన్‌వాడీ సిబ్బంది ఉన్నారు.